క్లుప్తంగా

ఘనంగా ఎల్లమ్మ బోనాలు



బోనాల ఊరేగింపులో మహిళలు

కొందుర్గు: మండల కేంద్రంలో మంగళవారం ఎల్లమ్మ బోనాలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు డప్పుచప్పుళ్ల మధ్య బోనాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మ వారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చు కున్నారు. ఊరేగింపులో శివసత్తుల పూనకాలు, పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

ఎంపీడీఓ వెంకయ్య



మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకయ్య

శంకర్‌పల్లి: భారీ వర్షాల నేపథ్యంలో గ్రామాల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ వెంకయ్య అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న రెండు రోజుల్లో పెద్దఎత్తున వర్షాలు పడే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ హెచ్చరించిందని, అధికారులు గ్రామాల్లో పర్యటించి శిథిలావస్థలో ఉన్న ఇళ్లు, భవనాల నుంచి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. మరమ్మతులు చేయాల్సిన పాఠశాలల నుంచి విద్యార్థులను ఖాళీ చేయించాలన్నారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. సమావేశంలో ఎంపీఓ గిరి రాజు, పంచాయతీ రాజ్ ఏఈ నందకిశోర్, ఏపీఓ నాగభూషణం, కార్యదర్శులు పాల్గొన్నారు.

మరుగుదొడ్లు, తరగతి గదుల నిర్మాణానికి కృషి



ఉపాధ్యాయులు, గ్రామస్తులతో మాట్లాడుతున్న దాత గోపాల్‌రెడ్డి

కేశంపేట: మండల పరిధిలోని సంగెంలో గల ప్రాథమికోన్నత పాఠశాలలో మరుగుదొడ్ల నిర్మాణానికి గ్రామానికి చెందిన ప్రసూన్ కన్‌స్ట్రక్షన్ యజమాని యెన్నం గోపాల్‌రెడ్డి రూ.25వేల ఆర్థికసాయం ప్రకటించాడు. ఈ మేరకు మంగళవారం ఉపాధ్యాయులకు ఆయన నగదు అందించాడు. పాఠశాలకు మన ఊరు–మన బడి పథకంలో భవనాలు మంజూరైనా కాంట్రాక్టర్ నిధులు రాకపోవడంతో నిర్మాణాలను అసంపూర్తిగా నిలిపివేశాడు. తరగతి గదులు, మరుగుదొడ్లు లేక విద్యార్థులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం చంద్రశేఖర్ దాత గోపాల్‌రెడ్డికి తెలిపారు. దీంతో ఆయన స్పందించి అసంపూర్తిగా ఉన్న భవనాన్ని తన కుమారుడు యెన్నం ప్రసూన్ కుమార్‌రెడ్డి జ్ఞాపకార్థం సొంత నిధుల ద్వారా పూర్తిచేసి ఇస్తానని ఉపాధ్యాయులకు, గ్రామస్తులకు హామీనిచ్చారు.

మహిళా సంఘాలను ఏర్పాటు చేయండి

డీపీఓ నర్సింలు



మాట్లాడుతున్న నర్సింలు

నందిగామ: వయో వృద్ధ మహిళా సంఘాలు, దివ్యాంగుల సంఘాలు, 60 సంవత్సరాల వయస్సు పైబడిన మహిళలతో కొత్తగా సంఘాలు ఏర్పాటు చేయాలని డీపీఓ(డీఆర్‌డీఏ జిల్లా ప్రాజెక్ట్ ఆఫీసర్) నర్సింలు సూచించారు. మండల కేంద్రమైన నందిగామలోని మహిళా సమాఖ్య కార్యాలయంలో మంగళవారం ఏపీఎం భగవంతు ఆధ్వర్యంలో గ్రామ సంఘం అధ్యక్షులు, సహాయకులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డీపీఓ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విభిన్న ప్రతిభావంతులను గుర్తించి దివ్యాంగుల సంఘాలను ఏర్పాటు చేయాలన్నారు. ఇలాంటి సంఘాలకు ప్రభుత్వం రూ.15వేలు రివాల్వింగ్ ఫండ్‌గా అందజేస్తుందని తెలిపారు. గ్రామాల్లో బుధవారం నుంచి సమావేశాలు ఏర్పాటు చేయాలని, సంఘాలలో ఇప్పటి వరకు లేని మహిళలను గుర్తించి కొత్త సంఘాలను ఈ నెల చివరి వరకు ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో సమాఖ్య అధ్యక్షులు అమృత, భాగ్య సీసీలు రజని, అనురాధ, యాదయ్య, అమర్ తదితరులు పాల్గొన్నారు.

నిధులు లేక.. సమస్యలు తీరక

- చేవెళ్ల మున్సిపాలిటీలో అంతర్గత రోడ్లు అధ్వానం
- పాఠశాలలు, వసతి గృహాల ఎదుట రోడ్లపై భారీగా చేరుతున్న వర్షపునీరు
- రాకపోకలకు తప్పని తిప్పలు
- అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని వినతి

చేవెళ్ల: పేరుకు మున్సిపాలిటీ పైసా నిధులు రాక పోయె. సమస్యలు తీరే దారిలేక ప్రజలకు అవస్థలు తప్పటం లేదు. చేవెళ్ల మున్సిపాలిటీగా ఏర్పడి ఏడాది కావొస్తున్నా పైసా నిధులు రాలేదు. దీంతో మున్సిపాలిటీ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించే మార్గం లేకుండాపోతోంది. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా నిధులు వచ్చిన వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తామని చెబుతున్నారు. నిధులు వచ్చేది ఎప్పుడో.. సమస్యలు తీరేదెప్పుడోనని మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

కాలనీలు, వార్డుల్లో భారీగా వరదనీరు..

చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలో జోరుగా కురుస్తున్న వర్షాలకు లోతట్టు కాలనీలు, వార్డుల్లో భారీగా వరదనీరు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విద్యాసంస్థల ఎదుట వరదనీరు భారీగా నిలిచినా పట్టించుకునే వారు లేకపోవటంతో విద్యార్థులకు తిప్పలు తప్పటం లేదు. కాలనీల్లో రోడ్లు పూర్తిగా గుంతలమయంగా మారడంతో నరకయాతన పడుతున్నామని వాపోతున్నారు. మున్సిపాలిటీ పరిధిలోని అన్ని కాలనీలు, వార్డుల్లో ప్రస్తుతం రోడ్లు అధ్వానంగా మారాయి. వర్షాలు పడితే చాలు ఈ రోడ్లపై నడవలేని పరిస్థితి ఎదురవుతోందని ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులకు మా సమస్యలు కనిపించటం లేదా అన్ని ప్రశ్నిస్తున్నారు. వర్షపు నీరు వెళ్లేందుకు సరైన మార్గాలు లేకపోవటంతో ఎక్కడ పడితే అక్కడే నీరు నిలవడంతో ఇబ్బందులు పడుతున్నామని అంటున్నారు. పట్టణ కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాల గేట్ ముందు, ఎస్సీ బాలుర వసతి గృహం ముందు వర్షం పడితే చెరువును తలపించేలా నీళ్లు నిలిచి రాకపోకలకు ఇబ్బందులు కలిగిస్తున్నాయి. వర్షం పడిన ప్రతీసారి ఈ ఇబ్బంది ఏర్పడుతూనే ఉంది. ఎవరో ఒకరు దాతలు ముందుకు వచ్చి అప్పటివరకు తాత్కాలిక పరిష్కారం చేస్తున్నా.. శాశ్వత పరిష్కారం చూపించే మార్గమే లేకుండాపోతోంది. ప్రస్తుతం కూడా విద్యార్థులు, ప్రజల ఇబ్బందులను గమనించిన పట్టణానికి చెందిన పలువురు దాతలు తమ సొంత నిధులు ఖర్చు చేసి నీరు నిలిచే చోట మట్టిపోయించి మరమ్మతులు చేస్తామని హామీనిచ్చారు. కానీ వారు మానవత్వంతో తాత్కాలికంగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నారని అది మళ్లీ వర్షం పడితే యథావిధిగా మారుతోందని ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి శాశ్వత పరిష్కారం చూపించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



చేవెళ్లలోని బాలికల పాఠశాల ఎదుట వర్షపునీటిలో ఇబ్బంది పడుతున్న విద్యార్థులు



చెరువును తలపిస్తున్న హౌసింగ్‌బోర్డు కాలనీకి వెళ్లే రోడ్డు



గుంతలమయంగా చంద్రారెడ్డినగర్, టీచర్స్ కాలనీ మార్గం

దాతల సహకారం అభినందనీయం

ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్

షాబాద్: పేద విద్యార్థులకు దాతలు అందిస్తున్న సహకారం అభినందనీయమని ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని అప్పారెడ్డిగూడ ప్రాథమిక పాఠశాలలో జాతీయ మానవ హక్కుల, క్రైమ్ కంట్రోల్ బోర్డు జిల్లా అధ్యక్షుడు లక్కాకుల అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచితంగా బ్యాగ్స్, స్టేషనరీ, వాటర్ బాటిల్స్ పంపిణీ చేశారు. విద్యార్థులు కష్టపడి చదివితేనే బంగారు భవిష్యత్తు ఉంటుందని, శ్రద్ధగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లోక్యానాయక్, గ్రామస్తులు కృష్ణయ్యగౌడ్, సందీప్‌గౌడ్, అనంతయ్య, కృష్ణయ్య, మల్లేశ్‌గౌడ్, ప్రమోద్‌గౌడ్, ఆర్గనైజర్ సెక్రటరీ చిర్ర సందీప్ ఉన్నారు.



విద్యార్థులతో దాత అనిల్‌కుమార్, ఉపాధ్యాయులు

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

మాజీ మున్సిపల్ చైర్మన్ నరేందర్



పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులు

షాద్‌నగర్: ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని పెంపొందించుకొని మానసిక ప్రశాంతత పొందాలని మాజీ మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్ అన్నారు. సంకటహర చతుర్థిని పురస్కరించుకొని మంగళవారం పట్టణంలోని వినాయక గంజ్ ఆవరణలో ఉన్న గణపతి దేవాలయంలో సాయిమిత్ర అసోసియేషన్ అధ్యక్షుడు మలగారి సత్యనారాయణ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల్లో నరేందర్ పాల్గొని మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని సూచించారు. భక్తితోనే ముక్తి లభిస్తుందన్నారు. అనంతరం పట్టణానికి చెందిన భగవాన్‌దాస్ మిలానీ భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు వన్నాడ వెంకటేశ్‌గౌడ్, అప్పి, శేఖరప్ప, నంద కిషోర్, అభిలాశ్, కోటిలింగంగౌడ్, రాజేశ్వర్, గోపాల్, శ్రీధర్, కృష్ణయ్య, సుదీప్‌జాదవ్, శేఖర్ రెడ్డి, మాణిక్ ప్రభు, సాగర్, గజవాడ నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

రైతుబీమాకు దరఖాస్తు చేసుకోండి

ఏడీఏ రమాదేవి

షాద్‌నగర్: అర్హులైన రైతులు రైతుబీమా పథకానికి దరఖాస్తు చేసుకోవాలని ఏడీఏ రమాదేవి అన్నారు. మంగళవారం ఫరూఖ్‌నగర్ మండల వ్యవసాయ కార్యాలయంలో రైతుబీమా దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 18 నుంచి 59 ఏళ్ల వయస్సు ఉన్న రైతులు రైతుబీమాకు పథకానికి అర్హులన్నారు. దరఖాస్తు చేసుకునేందుకు రైతులు తమ ఆధార్‌కార్డు, నామినీ ఆధార్, పట్టాదార్ పాసుపుస్తకం జిరాక్స్‌తో పాటు దరఖాస్తు ఫారంను నింపి వ్యవసాయ అధికారులకు అందజేయాలని తెలిపారు. ఎవరైనా రైతులు అకాలంగా మరణిస్తే వారి ఖాతాల్లో రైతుబీమా పథకం కింద రూ.5లక్షల ఆర్థికసాయం ప్రభుత్వం జమ చేస్తుందన్నారు. ఈ నెల 13వరకు దరఖాస్తుకు అవకాశం ఉందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గతంలో నమోదు చేసుకున్న రైతులు తిరిగి దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి నిషాంత్‌కుమార్, ఏఈఓ తేజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్న ఏడీఏ రమాదేవి

గ్రామ అభివృద్ధికి కృషి చేద్దాం

పంచాయతీ కార్యదర్శి శ్రీలతరెడ్డి



కార్యదర్శి శ్రీలతరెడ్డిని సన్మానిస్తున్న గ్రామస్తులు

మొయినాబాద్‌రూరల్: గ్రామ అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని పంచాయతీ కార్యదర్శి శ్రీలతరెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని చిన్నమంగళారం గ్రామ పంచాయతీ కార్యదర్శిగా శ్రీలతరెడ్డి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆమెకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. చిన్నమంగళారంలో పనిచేసిన కార్యదర్శి గత నెలరోజుల క్రితం కాశీంబౌలి గ్రామ పంచాయతీకి బదిలీ అయ్యారు. దీంతో శ్రీలతరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. గ్రామ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని అందరూ సహకరించాలన్నారు. పరిసరాల పరిశుభ్రత ఎంతో ముఖ్యమన్నారు. ఇందుకు గాను రోడ్లపై చెత్త వేయకుండా చెత్త బండిలో వేయాలని సూచించారు. ప్రజల సమస్యలు తెలుసుకొని పరిష్కరించేందుకు తమవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వాసుదేవ్, కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు గన్నెపాగ నర్సింగ్‌రావు, పార్టీ ప్రధాన కార్యదర్శి నయీముద్దీన్, నాయకులు రత్నం, జాఫర్, ఆనందం, మహిళలు పాల్గొన్నారు.

అక్రమ డిప్యూటేషన్లు రద్దుచేయాలని డిమాండ్

కొందుర్గు: ఉపాధ్యాయుల అక్రమ డిప్యూటేషన్లను రద్దుచేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ డిమాండ్ చేశారు. ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో మంగళవారం చౌదరిగూడ ఉన్నత పాఠశాల ఎదుట ఫ్లకార్డులతో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారులు, రాజకీయ నాయకుల అండతో కొందరు ఉపాధ్యాయులు గ్రామీణ ప్రాంతాల నుంచి హైదరాబాద్ పట్టణ ప్రాంతాలకు అక్రమ డిప్యూటేషన్లు వేయించుకుంటున్నారని ఆరోపించారు. దీంతో గిరి జన తండాలు, గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని వాపోయారు. ముఖ్యంగా జిల్లేడ్ చౌదరిగూడ, కొందుర్గు, ఫరూఖ్‌నగర్ మండలాల్లో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు అధికంగా డిప్యూటేషన్‌పై వెళ్లారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమ డిప్యూటేషన్లు రద్దుచేయాలని డిమాండ్ చేశారు. లేనిచో ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు శివశంకర్, ప్రవీన్, మనీ, రాజు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆలయ వార్షికోత్సవం



హోమంలో పాల్గొన్న గ్రామపెద్దలు, నాయకులు

చేవెళ్ల: మున్సిపాలిటీ పరిధిలోని మల్లారెడ్డిగూడ వార్డులో మంగళవారం అభయాంజనేయస్వామి ఆలయ 5వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు, హోమాలు, నవగ్రహ పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో ప్రజలు తరలివచ్చి పూజలు చేశారు. కార్యక్రమాల్లో సీఐ భూపాల్‌శ్రీధర్, ఎస్‌ఐ వనం శిరీష, పీఏసీఎస్ చైర్మన్ దేవర వెంకట్‌రెడ్డి, పీఏసీఎస్ ముడిమ్యాల మాజీ చైర్మన్ బల్వంత్‌రెడ్డి, మాజీ సర్పంచ్ మోహన్‌రెడ్డి, ఉపసర్పంచ్ రాధికవెంకటేశ్, నాయకులు, గ్రామపెద్దలు తదితరులు ఉన్నారు.

అధిక ధరకు టెండర్లు దాఖలు



టెండర్లను ఓపెన్ చేస్తున్న అధికారులు

షాద్‌నగర్‌రూరల్: పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయానికి సంబంధించిన దుకాణాల అద్దెల టెండర్లను మంగళవారం అధికారులు ఓపెన్ చేశారు. ఎంపీడీఓ బన్సీలాల్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో అద్దెల కోసం దాఖలు అయిన టెండర్లను ఓపెన్ చేశారు. షాప్ నంబర్లు 1ఏ–రూ.6,999, 13ఏ–6,777, 16ఏ–రూ.7,000, 17ఏ–రూ.7,100లు అధిక ధరకు టెండర్లు దాఖలు చేసినట్లు ఎంపీడీఓ తెలిపారు.

మోదీకి తొత్తుగా ఎన్నికల కమిషన్

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాని మోదీకి తొత్తుగా మారిందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మంగళవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య వ్యవస్థలో స్వతంత్రంగా వ్యవహరించాల్సిన ఎన్నికల సంఘం సీబీఐ, ఈడీ సంస్థలు బీజేపీ ప్రభుత్వానికి తొత్తులుగా మారాయని ఆరోపించారు. దేశ వ్యాప్తంగా ఓట్ల చోరీ జరుగుతుందని, ఇది దేశ సమగ్రతకు గొడ్డలి పెట్టులాంటిదన్నారు. దేశ వ్యాప్తంగా బోగస్ ఓట్లు అధికంగా ఉన్నా ఎన్నికల కమిషన్ పట్టించుకోవడం లేదన్నారు. ఎన్నికల కమిషన్ వ్యవహరిస్తున్న తీరుపై కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తుందన్నారు. ఒక వ్యక్తికి ఒక ఓటు ఉండాలన్న నిబంధనపై తాము పోరాటం చేస్తున్నామన్నారు. ఢిల్లీలో ఎలక్షన్ కమిషన్ కార్యాలయం వరకు ఇండియా కూటమి చేపట్టిన ర్యాలీని పోలీసులు అడ్డుకొని రాహుల్ గాంధీని అరెస్టు చేయడం సరికాదన్నారు. బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని తమ గుప్పిట్లోకి తీసుకొని పోలీసుల ద్వారా ప్రశ్నించే గొంతులను అణదొక్కేందుకు ప్రయత్నిస్తోందన్నారు. ఎన్నికల కమిషన్‌తో బీజేపీ కుమ్మక్కై ఎన్నికల్లో గెలుస్తుందని ఆరోపించారు. దొంగ ఓట్లపై పార్టీ అధినేత రాహుల్ గాంధీ లేవనెత్తిన ప్రశ్నలకు ఎన్నికల కమిషన్ సమాధానం ఇవ్వకుండా నోటీసులు జారీ చేయడం ఏమిటని ప్రశ్నించారు. అదేవిధంగా షాద్‌నగర్ నియోజకవర్గంలోని మొదళ్లగూడ గ్రామంతో పాటు అనేక గ్రామాల్లో బోగస్ ఓట్లు అధికంగా ఉన్నాయని, ఇతర రాష్ట్రాలకు చెందిన వారి పేర్లను ఓటరు జాబితాలో చేర్చారన్నారు. ఓ యూనివర్సిటీకి చెందిన ఇతర రాష్ట్రాల విద్యార్థుల పేర్లు కూడా ఓటరు జాబితాలో చేర్చారని ఆరోపించారు. గత ఎన్నికల సమయంలో ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. దొంగ ఓట్లపై కాంగ్రెస్ పార్టీ పోరాటాన్ని ప్రారంభించిందన్నారు. సమావేశంలో నాయకులు బాబర్‌ఖాన్, కృష్ణారెడ్డి, చెంది తిరుపతిరెడ్డి, బాల్‌రాజ్‌గౌడ్, చెన్నయ్య, శ్రీకాంత్‌రెడ్డి, ఇబ్రహీం, శ్రీనునాయక్, చంద్రశేఖర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, నాయకులు

మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం

షాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం అన్నారు. మంగళవారం మండల పరిధిలోని తిమ్మారెడ్డిగూడ 226 బూత్ అధ్యక్షుడిగా బాలకృష్ణ, మద్దూరు 185 బూత్ అధ్యక్షుడిగా రవీందర్‌రెడ్డి, మద్దూరు 186 బూత్ అధ్యక్షుడిగా శ్రీనివాస్, కేశవగూడ 197 బూత్ అధ్యక్షుడిగా మహేందర్‌ను ఏకగ్రీవంగా ఎనుకున్నామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీకి యువతే కీలకమని, అందరూ ఏకమై పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ మండలంలో బీజేపీ జెండా ఎగిరేలా యువత సమష్టిగా కృషి చేయాలన్నారు. ప్రధాని మోదీ ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరవేసేందుకు ప్రముఖపాత్ర వహించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ విఫల్యాలను ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు, మండల ఎన్నికల ఇన్‌చార్జి ప్రభాకర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు మాణయ్య, జిల్లా అధికార ప్రతినిధి శ్రీధర్‌రెడ్డి, బీజేవైఎం స్వచ్ఛభారత్ సెల్ రాష్ట్ర కన్వీనర్ రాము, నాయకులు తదితరులు ఉన్నారు.

మహాసభలకు తరలిరావాలి

మొయినాబాద్: సీపీఐ రాష్ట్ర 4వ మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రామస్వామి పిలుపునిచ్చారు. మంగళవారం మొయినాబాద్ మున్సిపాలిటీలో మహాసభల వాల్‌పోస్టర్‌ను ఆయన పలువురు నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 19 నుంచి 22 వరకు పార్టీ రాష్ట్ర మహాసభలు మేడ్చెల్ జిల్లా కుత్బుల్లాపూర్‌లోని గాజుల రామారంలో జరుగుతాయని.. అన్ని ప్రాంతాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలతో పాటు ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, ప్రభులింగం పాల్గొన్నారు.

పీఆర్టీయూ సభ్యత్వ నమోదు

కేశంపేట: మండలంలోని కేశంపేట, వేములనర్వ, పాపిరెడ్డిగూడ, కొండారెడ్డిపల్లి గ్రామాల్లోని పాఠశాలల్లో మంగళవారం పీఆర్టీయూ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో పీఆ జిల్లా మాజీ అధ్యక్షుడు కన్నయ్యగారి గోవర్ధన్‌యాదవ్ పాల్గొని పలువురు ఉపాధ్యాయులకు సభ్యత్వ నమోదు పత్రాలను అందించారు. పీఆర్టీయూ ద్వారానే ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. సీపీఎస్ రద్దు, ఓపీఎస్ పునరుద్ధరణకు సెప్టెంబర్ 1న హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద పీఆర్టీయూ ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన మహాధర్నాకు ఉపాధ్యాయులు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కరుణాకర్‌గౌడ్, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, గోవర్ధనచారి, వేణుగోపాల్, గోవర్ధన్, శేఖర్ రెడ్డి, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.



వేములనర్వలో ఉపాధ్యాయులకు సభ్యత్వ నమోదు పత్రాలు అందిస్తున్న గోవర్ధన్‌యాదవ్

బోరుమోటారు ఏర్పాటు

షాద్‌నగర్: మండల పరిధిలోని కంసాన్‌పల్లిలో ఉన్న ప్రభుత్వ పాఠశాల ఆవరణలో మాజీ వైస్ ఎంపీపీ బసిరెడ్డి నరేందర్‌రెడ్డి మంగళవారం తన సొంత ఖర్చులతో బోరు మోటారును బిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు కనీస మౌలిక సదుపాయాలను కల్పించడంలో భాగంగా సొంత ఖర్చులతో బోరు మోటారును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజునాయక్, పాఠశాల కమిటీ చైర్మన్ కృష్ణయ్య, నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



బోరు మోటారును ఏర్పాటు చేయిస్తున్న దాత నరేందరరెడ్డి

జోరుగా ప్రవహిస్తున్న వాగులు

నందిగామ: ఇటీవల కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు పొంగపొర్లుతున్నాయి. ఎగువన కురిసిన వర్షాలకు వాగుల ద్వారా పెద్దఎత్తున చెరువులు, కుంటల్లోకి నీరు చేరుతుండడంతో ఇప్పటికే మండలంలో దాదాపుగా అన్ని నిండిపోయాయి. అయినా కూడా నందిగామ, నర్సప్పగూడ, వీర్లపల్లి, అప్పారెడ్డిగూడ తదితర గ్రామాల సమీపంలోని వాగులు పొంగిపొర్లుతున్నాయి. దీంతో నందిగామ నుంచి వీర్లపల్లికి వెళ్లే రహదారిపై రాకపోకలు నిలిచిపోయాయి. నర్సప్పగూడ అక్కమ్మ చెరువు, నందిగామలోని నల్లవాగు పెద్దఎత్తున ప్రవాహిస్తున్నాయి.



నందిగామలోని నల్లకుంట వాగుపై నిర్మించిన చెక్‌డ్యామ్ నుంచి పొర్లుతున్న నీరు



నర్సప్పగూడ అక్కమ్మ చెరువులోకి భారీగా చేరిన వరదనీరు